హైదరాబాద్
22-8-2023
సంపుటి:08
సంచిక: 349
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# సిట్టింగులకే సై!

- గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ కేసీఆర్ పోటీ
- మొత్తంగా బీఆర్ఎస్ జాబితాలో ఏడుగురు మహిళలు
- కమ్యూనిస్టులతో ఎలాంటి పొత్తూ లేదని ప్రకటించిన కేసీఆర్
- సర్దుబాటులో భాగంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి!
- ఒకట్రెండు రోజుల్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తా: మహేందర్‌రెడ్డి
- టికెట్ దక్కని సిట్టింగ్‌లు..
- వీరి స్థానంలో టికెట్లు పొందినవారు

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. ఊహించినట్టుగానే బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. సిట్టింగ్‌లకే ప్రాధాన్యమిస్తూ, పెద్దగా మార్పు చేర్పులేవీ లేకుండానే.. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం విడుదల చేశారు. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను.. నాలుగు సీట్లు మినహా మిగతా 115 నియోజకవర్గాల టికెట్లను ప్రకటించారు. మిగతా నాలుగు చోట్ల స్థానిక పరిస్థితులను మరోసారి మదింపు చేశాక అభ్యర్థులను ఖరారు



మిగతా 3లో



3 లో

## ఓటమి ఒప్పుకున్న కేసీఆర్!

### టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు

- రెండు నియోజకవర్గాల్లో పోటీతో ఇది స్పష్టమైంది
- కానీ ఆయన రెండు స్థానాల్లోనూ ఓడిపోతారు
- ముఖ్యమంత్రి గొంతులో భయం, ఓటమి కనిపించింది
- మూడింట రెండొంతుల మెజారిటీతో కాంగ్రెస్ గెలుస్తుంది

## 50 కోట్ల మార్క్‌ను దాటిన జన్‌ధన్ యోజన

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద బ్యాంకు ఖాతాల సంఖ్య 50 కోట్ల మార్క్‌ను అధిగమించింది. ప్రారంభించిన తొమ్మిదేళ్లలో ఈ మైలురాయి నమోదైంది. ఇందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ప్రారంభమైనట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. మొత్తం జన్‌ధన్ ఖాతాల్లో 67 శాతం గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల నుంచి ఉన్నట్టు పేర్కొంది. ఈ ఖాతాల్లో మొత్తం రూ.2.03 లక్షల కోట్ల డిపాజిట్లు ఉండగా, ఈ ఖాతాలకు సంబంధించి 34 కోట్ల రూపే కార్డులను ఉచితంగా అందించినట్టు తెలిపింది.ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఒక్కో ఖాతాలో సగటు బ్యాలన్స్ రూ.4,076గా ఉందని.. 5.5 కోట్ల ఖాతాలు ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలు అందుకుంటున్నట్టు వెల్లడించింది.




2లో

## ఆత్మ విశ్వాసమా.. బలహీనతా?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలకుపైగా గడువున్నా.. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ముందస్తుగా ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లోనూ దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా, ఒకేసారి అభ్యర్థులను వెల్లడించడంలో కేసీఆర్ ఆత్మవిశ్వాసం కనిపిస్తోందని ఓవైపు హర్షం కనిపిస్తుండగా.. ప్రజల్లో వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దాదాపు 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వడం బలహీనతేనని మరోవైపు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్పులు చేయడానికి అవకాశమున్నా మెజారిటీ

మిగతా 3లో



## చట్ట ప్రకారమే సోదాలు

- చట్ట ఉల్లంఘనలకు పాల్పడింది మార్గదర్శే.. మేం కాదు
- పగలు సోదాలు చేస్తుంటే ఇబ్బంది అంటున్నారు
- రాత్రిళ్లు చేస్తే నేరం చేసినట్లు ఫిర్యాదు చేస్తున్నారు
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించలేదు
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడో రేపో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామన్న హైకోర్టు
- అప్పటివరకు సోదాలు వద్దని సూచన

అమరావతి : మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ సంస్థే చట్ట ఉల్లంఘనలకు పాల్పడిందని ప్రభుత్వం హైకోర్టుకు సోమవారం నివేదించింది. తాము ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదని, మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తాజా సోదాలన్నీ నిబంధనలకు అనుగుణంగానే జరుగుతున్నాయని నివేదించింది. చిట్ రిజిస్ట్రార్లు చేస్తున్న సోదాలను సవాలు చేస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ నైనాల జయసూర్య సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. చట్టం ఇచ్చిన అధికారం మేరకే చిట్ రిజిస్ట్రార్లు సోదాలు చేస్తున్నారని తెలిపారు. పగలు సోదాలు చేస్తుంటే చందాదారులు ఇబ్బంది పడుతున్నారని, కార్యకలాపాలకు విఘాతం కలుగుతోందంటున్న మార్గదర్శి.. ఎవరికీ ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో

3లో

## ఉద్యోగుల ఆకాంక్ష తీరేలా!

### ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో సీఎం జగన్ శుభవార్త

- ఉద్యోగులకు పండుగ కానుకగా దసరాకి 'డీఏ'
- పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదల చేస్తాం
- వైద్య ఆరోగ్యశాఖలో మహిళలకు 5 అదనపు సెలవులు
- మీ సమస్యలను నిజాయితీతో పరిష్కరించా
- మీ సంతోషం, మీ భవిష్యత్తు నా బాధ్యతే
- ఏ ప్రభుత్వంతో పోల్చినా గతం కంటే మిన్నగా చేశాం
- ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు
- ఆ పుస్తకాన్ని ప్రతి ఉద్యోగీ చదవాలని కోరుతున్నా
- అలాంటి వ్యక్తి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా 2022 జూలై ఒకటికి సంబంధించిన డీఏ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. బకాయి ఉన్న రెండు డీఏల్లో ఒకటి పండుగ రోజు ఇస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగులకు ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగానే 5 రోజులు అడిషనల్ లీవులు ఇస్తామని



3లో

చెప్పారు. సోమవారం విజయువాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ఎన్జీవోల సంఘం 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో గతంలోని అన్ని ప్రభుత్వాల కంటే ఎంతో

## మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం!

- హరీశ్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న బీఆర్ఎస్ అధిష్టానం
- మెదక్‌లో మంత్రి హరీశ్‌రావు పెత్తనం ఏమిటన్న మైనంపల్లి
- మల్కాజిగిరి ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్, కవిత
- తాము హరీశ్‌కు సంఘీభావంగా ఉంటామన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



3లో

## నిర్విరామంగా 12 గంటల నడక

- లోకేశ్ సరికొత్త రికార్డు
- యువగళం పాదయాత్రలో అరుదైన ఘట్టం
- ఆదివారం మధ్యాహ్నం 3.40 గంటల నుంచి
- సోమవారం తెల్లవారుజాము 4 వరకూ యాత్ర
- వర్షం కురుస్తున్నా యువనేత ముందుకు



3లో

## మహిళలకు ఆరు సీట్లేనా?

### ఢిల్లీలో మహిళా రిజర్వేషన్లపై చేసినవి దొంగ దీక్షలేనా?..

### బీజేపీకి పెరుగుతున్న ఆదరణతో కేసీఆర్‌లో ఆందోళన

న్యూఢిల్లీ :చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బంగారు కుటుంబసభ్యులు చేసినవన్నీ దొంగ దీక్షలేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 33 శాతం రిజర్వేషన్లు అంటూ



# సంపాదకీయం

## ఇది సరైన ఔషధమేనా?

జనరిక్ ఔషధాల వినియోగాన్ని మెరుగ్గా అమలు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మరోసారి మార్గదర్శకాలు జారీ చేసింది. ఖరీదైన కంపెనీ మందుల బదులు చౌకగా లభించే జనరిక్ ఔషధాలనే తప్పక రాయాలంటూ వైద్యులకు ఆదేశాలిచ్చింది. వైద్యం ఖరీదవుతున్న వేళ సామాన్యులకు సాంత్వననిచ్చే ఆదేశాలు స్వాగతించాల్సినవే. ఈ విషయంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలివ్వడం ఇదేమీ తొలిసారి కాదు. మునుపెప్పుడో ఇచ్చినా, వాటి అమలు అంతంత మాత్రమైంది. అందుకే, ఈసారి ఆదేశాలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామంటూ హెచ్చరించింది. ఇక్కడే తకరారు వచ్చింది. ఇది 'పట్టాలు లేకుండా రైళ్ళు నడపడం లాంటిది' అంటూ దేశంలోని వైద్యులకు అతి పెద్ద సంఘమైన భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) తప్పుపడుతోంది. ఈ విధాన నిర్ణయాలు తీసుకొనే ముందే జనరిక్ మందుల్ని ప్రోత్సహించి, నాణ్యమైనవి దొరికేలా చేయాల్సింది. అది చేయకుండా జరిమానా నిబంధనలు పెట్టడం ఏ మాత్రం సబబన్నది ఐఎంఏ వాదన. వెరసి, వృత్తి నిర్వహణకు సంబంధించి ఆగస్ట్ మొదట్లో అమలులోకి వచ్చిన కొత్త మార్గదర్శకాలపై చర్చ జరుగుతోంది. ఈ నిబంధనల ప్రకారం డాక్టర్లు ఇకపై మోతాదులో స్వల్పతేడా సైతం దుష్పరిణామాలకు దారి తీసే మందుల విషయంలో తప్ప, మిగతావన్నీ జనరిక్ మందులే సిఫార్సు చేయాలి. ఫలానా బ్రాండే వాడాలనకూడదు. తత్సమాన జనరిక్ ఔషధం పేరు రాయాలి. నిర్ణీత మోతాదులో, అనుమతించిన కాంబినేషన్లలోనే ఆచితూచి మందులు రాయాలి. స్పష్టంగా, అర్థమయ్యేలా, ఇంకా వీలుంటే ఇంగ్లీషులో పెద్ద బడి అక్షరాల్లో మందుల చీటీ రాయాలి. అర్థం కాని కోడిగీతల్లో రాస్తే గందరగోళ పడ్డ రోగులు పొరపాటుగా వేరే మందులు తీసుకొనే ప్రమాదం ఉందనేది అంతరార్థం. అలాగే రోగి పరిస్థితి, చికిత్స, ఫలితం లాంటివి డాక్టర్లు ట్విట్టర్ వగైరాల్లో చర్చించరాదంటూ రోగుల హక్కులు కాపాడేలా 11 అంశాలతో సోషల్ మీడియా మార్గదర్శకాలూ ఇచ్చింది. ఇవన్నీ మంచి మాటలే. బ్రాండెడ్ మందులతో పోలిస్తే, జనరిక్ ఔషధాలు సగటున 30 నుంచి 80 శాతం చౌకని ఓ లెక్క. అందువల్ల ఆ మేరకు ఆరోగ్యరక్షణ ఖర్చులు తగ్గుతాయి. సహజంగానే సామాన్యులకు అది పెద్ద ఊరట. అదే సమయంలో, డాక్టర్ల వాదన ఏమిటంటే మిగిలే లాభం తక్కువ గనక అన్ని ఫార్మ సీలూ అన్నిరకాల జనరిక్ మందులనూ నిల్వ చేయవు. డాక్టర్ రాసిచ్చిన మందు లేనప్పుడు నిర్ణయం షాపువాడి చేతిలోకి వస్తుంది. అప్పుడు నాణ్యతతో సంబంధం లేకుండా, ఎక్కువ లాభం మిగిలే మందులను అంగట్లో అంటగట్టే ప్రమాదం ఉంది. అంతేకాక, వైద్యులు తమ అనుభవం కొద్దీ రోగికి సరిపోయే మందు రాయడానికి వీలు లేకుండా పోతుందనీ, కంపెనీలను బట్టి జనరిక్ ఔషధాల నాణ్యతలోనూ తేడాలు తప్పవు గనక చికిత్స సమర్థంగా సాగదనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో నాణ్యతా ప్రమాణాల నియంత్రణ అంతంత మాత్రమే. కాబట్టి ఈ ఆందోళనను అంత తేలిగ్గా కొట్టిపారేయలేం. నాణ్యతకు హామీ లేకపోతే, మందుల్ని వాడినా ప్రయోజనం ఉండదన్నది నిష్ఠురసత్యం. ఈ రకమైన చికిత్స, ఔషధ వినియోగంతో వ్యాధి తగ్గకుంటే రోగికి నష్టం, డాక్టర్ పేరుకూ దెబ్బ. ఇన్ని లోతుపాతులున్న అంశంపై నిర్ణయాలు ప్రకటించే ముందు సంబంధిత వర్గాలన్నిటితో సమగ్రంగా చర్చించడం తప్పక అవసరం. అదేమీ లేకుండా మార్గదర్శకా లను నోటిపై చేశారని వైద్యవర్గాల ఆరోపణ. నిజానికి, దేశంలోని జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో చేయాల్సింది చాలా ఉంది. అది డాక్టర్లు, మందుల ఉత్పత్తిదార్లు, పాలకులు అంతా అంగీకరించే మాటే. తయారయ్యే మందుల్లో అన్ని బ్యాచ్‌లకూ ప్రభుత్వం నాణ్యతా పరీక్ష చేయడం ఆచరణ సాధ్యం కాదు. కేవలం 0.1 శాతం మందులకే పరీక్షలు జరుగుతున్నాయట. గత మూడేళ్ళ కాలంలో జనరిక్, బ్రాండెడ్ జనరిక్, బ్రాండెడ్ మందులన్నిటికీ జరిపిన పరీక్షల్లో దాదాపు 3 శాతం ప్రమాణాల మేరకు నాణ్యంగా లేవని సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి

- అదనపు కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేత
- ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీ




**వరంగల్ ఆగస్టు 21సమ సమాజం::** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం రోజున అదాలత్ సర్కిల్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ చేస్తూ చలో కలెక్టరేట్ ముట్టడిని వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది జిల్లా అదనపు కలెక్టర్ గారికి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల విద్యార్థులకు 5177 కోట్లు రూపాయలు మూడు ఏళ్ల నుండి విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు కాబట్టి తక్షణమే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్స్ను విడుదల చేయాలని అన్నారు అదేవిధంగా వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలకు మన ఊరు మనబడి మనబస్తీ మనబడి ప్రణాళికలో భాగంగా అన్ని పాఠశాలలను చేర్చి వాటి అభివృద్ధికి నోచుకోవాలని తెలిపారు సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థులకు నష్టం జరిగేలా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ సంక్షేమ వసతి గృహాలను మూసివేయాలని ఆలోచనలో ఉన్నారు అని అన్నారు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు వాటికి సొంత భవనాలు లేక ఇరుకు గదులలో ఉంటూ అద్దభవన్లో ఉంటూ అనేక ఇబ్బందులకు గురవుతున్నటువంటి పరిస్థితి ఉంది అదేవిధంగా కేజీబీవీలలో ఓకే రూములలో 25 నుండి 50 మంది విద్యార్థులు పడుకున్నటువంటి పరిస్థితి ఉంది జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్యా వ్యవస్థ పైన ఎటువంటి సమీక్ష లేకుండా ఉండడం వలన విద్యావ్యవస్థ సర్వనాశనం అవుతున్నది కాబట్టి జిల్లా వ్యాప్తంగా డీఈవో మరియు రెగ్యులర్ ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను స్కావెంజర్ పోస్టులను ఏర్పాటు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బానోతు వినోద్ కుమార్ కళ్యాణ్ నర్సంపేట పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పైసా గణేష్ కొయ్యల మోహన్ ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ మహేష్ జీవన్ అఖిల్ వంశీ సాయికుమార్ అజిత్ సతీష్ కుమార్ శివప్రసాద్ చందు శాలెం రాజు సచిన్ సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళపై పోలీసుల థర్డ్ డిగ్రీని తీవ్రంగా ఖండిస్తున్న

- ఆరవ రోజుకు చేరుకున్న ఏఎన్ఎం ల సమ్మె
- రెండో ఏఎన్ఎంల పట్ల కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- శ్రావణ సోమవారం రోజున బోనాలతో నిరసన



**వరంగల్ ఆగస్ట్ 21: సమ సమాజం:** సెకండ్ ఏఎన్ఎంలపై కేసీఆర్ ది సవితి తల్లి ప్రేమ సరికాదని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సెకండ్ ఏఎన్ఎం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు గోపు సుజాత అన్నారు. శ్రావణ సోమవారమును సైతం లెక్కచే యకుండా బోనాలతో సెకండ్ ఏఎన్ఎంలు ఏకశిలా పార్కు వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబ పోషణ కష్టం అయినప్పటికీ,ప్రజల ఆరోగ్యాన్ని కాపా డడంలోగాని, రాష్ట్రానికి అవార్డులు తీసుకురావడంలో గాని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ఏఎన్ఎంలను అందరిని ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని అన్నారు,ఏఎన్ఎం లకు ఉద్యోగ భద్రత కల్పించాలని,ప్రమాద భీమా 50 లక్షలు ఇవ్వాలని,దురదుష్టవత్తుఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు,కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని,ఉద్యోగులపై కేసీఆర్ ది సవితితల్లి ప్రేమ సరికాదని అన్నారు, సమస్త ఉద్యోగులను క్రమబద్ధీ కరిస్తామని అసెంబ్లీలో, వేదికలపై ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వారిని మోసం చేస్తున్నారని అన్నారు, క్రమ బద్ధీకరణ డిమాండ్పై రెండో ఏఎన్ఎంలు ఆధ్వర్యంలో గత అనేక సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్న ముఖ్యమంత్రి పట్టించుకోకుండా,ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారని అన్నారు, ఎన్నికల సమయంలో మరియు ఉద్యమ సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు,ఆంధ్ర పరిపాలనలో కాంట్రాక్టు వ్యవస్థను బానిస వ్యవస్థతో పోల్చిన కెసిఆర్. ఇప్పుడు అంతకన్నా ఘోరంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ఏఎన్ఎంలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో అత్యంత కీలకపాత్ర పోషించాలని అన్నారు దేవుళ్లతో సమానంగా పోల్చిన కేసీఆర్ ఇప్పుడు పట్టించుకో కపోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన మాత్రమే చేస్తుందని సమస్యలు పరిష్కరించాలని ఉద్దేశం లేదని అన్నారు, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పథకాల అమలుకోసం వాడు కుంటుందే తప్ప వారికి చట్టబద్దంగా అమలు కావాల్సిన సదుపాయాలు, కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా మహిళా ఉద్యోగులను రోడ్లెక్కి ఆందోళనలు చేయాల్సిన దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గత 20 సంవత్సరాలుగా రెండో ఏఎన్ఎం హోదాతో ప్రజలకు వైద్యసేవలందిస్తూ ఎంతో అనుభవం ఉన్న మహిళా సిబ్బందిని వైద్యశాఖ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వకుండా ఏకపక్షంగా ఉద్యోగ ప్రకటన విడుదల చేయడమేంటని ప్రశ్నించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటనను అమలు చేయాలని, హక్కులు అమలు చేయాలని రెండో ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారని దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. చర్చల పేరుతో కాలాయాపన చేయకుండా ఏకైక డిమాండైన క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు కొంగర సాలమ్మ చంద్రకళ లలిత నాగలక్ష్మి రజిత శ్వేత సుజాత జ్యోతి కరుణ లలిత లలిత, వరంగల్ జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎంలు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## అభివృద్ధికి నోచుకోని సింగరేణి కాలనీ. పట్టించుకోని ప్రజాప్రతినిధులు అధికారులు.

**హైదరాబాద్ ఆగస్టు 21/సమ సమాజం:** సింగరేణికాలనీ వాంబ్కోటర్స్.(56బిల్డింగ్స్ 1792ఇల్లు)ఇక్కడ ఎటువంటి అభివృద్ధి జరగడంలేదు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సింగరేణి కాలనీ ఎలాంటి సదుపాయాల అందక.ముఖ్యంగా బిల్డింగులలో చెత్తపేరుకుపోయి డ్రైనేజి లైన్ పూర్తిగా నాశనం అయింది .తద్వార డ్రైనేజి పొంగి రోడ్లమీదకు వస్తుంది.ఈ డ్రైనేజి నీరు మంచినీటిలో కలుస్తుంది. దీనివలన అనేకరోగాలు, దుర్గందం, దోమలు వస్తున్నాయి. సింగరేణి కాలనీ సమస్యలపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు అని అన్నారు. ఐ.ఎస్.సదన్ డివిజన్ వార్డు ఆఫీసు ఇంచార్జీ వాసీపుద్దీన్ కీ పోటోలతో సహ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.వారు సమస్యలను ఆన్ లైన్ లో పొందుపరచారు.సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపిఐ ఐ.ఎస్.సదన్ డివిజన్ కార్యదర్శి.షేక్.మహమూద్, పార్టీ వార్డుమెంబర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



## గడ్డం నారం డివిజన్ అధ్యక్షునిగా ఎం .సునీల్ బాబు.



**ఎల్బీనగర్ ఆగస్టు 21/సమ సమాజం:** తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ఎస్వీ. కృష్ణా ప్రసాద్. ఎల్బీనగర్ నియోజకవర్గంఇంచార్జ్ .గడ్డిఅన్నారం డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. అందులో భాగంగా యం.సునిల్ బాబు కి రెండవసారి గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు నా హార్దిక ధన్యవాదాలు అలాగే నాతోపాటు కమిటీలో మిగతా సభ్యులు కూడా ఎన్నిక చేసినందుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## తొర్రూరు ఆర్టీసీ డిపో ఔట్సోర్సింగ్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు దంతాలపల్లి సోమేశ్వర్



**తొర్రూరు సమ సమాజం:** తొర్రూరు ఆర్టీసీ డిపోలో డిపో ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు దంతాలపల్లి సోమేశ్వర్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యొక్క సమస్యల గురించి మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం చెల్లించాలని, మరియు వారిపై పడుతున్న అధిక పని భారాన్ని తగ్గించాలని కార్మికుల యొక్క సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే చాలా సంవత్సరముల నుండి ఆర్టీసీ డిపోలో ఔట్సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నాము కనుక ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను పరిష్కరించి డిపో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డిపో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగీలాల్, సహాయ కార్యదర్శి నర్మట రాజు, కార్యవర్గ సభ్యులు,తదితరులు పాల్గొనడం జరిగింది.



## దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ లో అక్రమ నిర్మాణం



**శేరిలింగంపల్లి, ఆగష్టు 21సమ సమాజం::** కొండాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గం చెరువు కు ఆనుకొని ఉన్న అమర్ సొసైటీలో ప్లాట్ నెంబర్ 116 117 వ వరుసలలో ఏలాంటి అనుమతులు లేకుండా వ్యాపార నిమిత్తమై దాదాపు 500 గజములలో షెడ్డు నిర్మాణం జరుగుతున్నది అక్కడ ఉన్న స్థానికుల సమాచారము ప్రకారం అందులో పబ్బు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారని వినికిడి అమర్ సొసైటీ రెసిడెన్షియల్ కొరకు ఏర్పాటు అయింది ఇందులో వ్యాపార నిమిత్తం పబ్బు లు పెడితే బాగుండదు అని కొంతమంది తెలిపినారుమరి ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం చెరువులు కుంటలు కాపాడాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి దుర్గం చెరువును ఎంతో అభివృద్ధి చేస్తుంటే ఇట్టి చెరువుకు ఆనుకొని బోటింగ్ ఏరియా లోని ఎఫ్ టి ఎల్ లో ఇలా అనుమతులు లేకుండా వ్యాపార నిమిత్తమై భారీ షెడ్లు వేస్తున్నారు కాబట్టి అధికారులు వెంటనే పరిశీలించి చర్య తీసుకోగలరని ప్రజల కోసం రాష్ట్ర అధ్యక్షులు విద్యాల మల్లారెడ్డి ఒక ప్రకటనలో కోరారు

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి కేసీఆర్ విశ్వాసాన్ని నిలబెడతా

- సీఎం కేసీఆర్ కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపిన "ఎమ్మెల్యే అంజయ్య"
- ఎమ్మెల్యే అంజయ్యకు కార్యకర్తల అభినందనల వెల్లువ
- చైర్మన్ రాజా వరప్రసాద్ కీలక వ్యాఖ్యలు
- షాద్ నగర్ అసెంబ్లీ టికెట్ కేటాయింపు పై మీడియా శుభాకాంక్షలు





**షాద్ నగర్: సమ సమాజం:** ముఖ్యమంత్రి కెసిఆర్ నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయను ఆయన ఎన్నోసార్లు నాకు గుర్తింపు ఇచ్చి రెండు సార్లు ఎమ్మెల్యే చేశారు.. నాలుగోసారి అవకాశం మళ్ళీ ఇచ్చారు. కృతజ్ఞతా భావంతో ఈ నియోజకవర్గాన్ని గెలిచి అభివృద్ధి కోసం కేసీఆర్ కు అందిస్తానని, ఎవరు ఊహించని రీతిలో తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడారు. తనపై ఎంతో విశ్వాసం ఉంచి నాలుగు పర్యాయాలు పార్టీ తరపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని మూడోసారి కూడా ప్రజల సహకారంతో గెలిచి ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మరోసారి పనిచేస్తానని అన్నారు.

మొదటినుండి తనపై పెట్టిన విశ్వాసం ఎంతో గొప్పదని ఆయన ఆశయాల అడుగుజాడల్లో నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని అన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ కు మనస్ఫూర్తిగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు, మీడియా, పార్టీ శ్రేణుల సహకారం ఎంతో గొప్పదని అందరికీ అందుబాటులో ఉండి మరింత అభివృద్ధి చేసేందుకు తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అంజయ్య కోరారు. ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి మిగతా రాష్ట్రాలకు ఒక మోడల్ తెలంగాణా రాష్ట్రమని అన్నారు.

కెసిఆర్ పాలన గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్ని విషయాలు ప్రజలకు తెలుసని ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు విమర్శలు చేసిన ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**తిరుగులేని నేతగా అంజన్న**

భారత రాష్ట్ర సమితి పార్టీలో తిరుగులేని నేతగా ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ అవతరించారని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాజా వరప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే అంజయ్యకు అసెంబ్లీ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యేను పొగడ్తలతో ముచ్చెత్తారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఎల్లప్పుడు అభివృద్ధి కోసం పరితపించే గొప్ప వ్యక్తి అంజయ్య యాదవ్ అని, ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని మూడోసారి కూడా గెలిచి తన సత్తా చాటుతారని అన్నారు. 40 వేల మెజార్టీని సొంతం చేసుకోవడం ఖాయమని రాజా వరప్రసాద్ ప్రకటించారు. ప్రతిపక్షాలు ఎవరెన్ని అసత్య ఆరోపణలు చేసిన ఆయనను ఆయన కుటుంబాన్ని విమర్శించిన మౌనమే ఆయన సమాధానమని ఆ మంచితనమే నేడు ఆయనకు శ్రీరామరక్షగా మారిందని రాజా వరప్రసాద్ అన్నారు.

**ఇచ్చిన మాట ప్రకారం ప్రతాప్ రెడ్డి ప్రచారం చేయాలి**

ఇటీవల టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తను చేసిన మీడియా ప్రకటన ప్రకారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు ప్రచారం చేసి తన మద్దతు కూడగట్టాలని చైర్మన్ రాజా వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో రాజవరప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల టికెట్ విషయంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఎవరికి టికెట్ వచ్చినా ఒకరికి ఒకరం కలిసి సహకరించుకుంటామని గెలుపుకు కృషి చేస్తామని చెప్పారని ఆ మాట గుర్తుంచుకొని పార్టీలో నిబద్ధతగా పనిచేయాలని రాజావరప్రసాద్ సూచించారు.

**ముఖ్యమంత్రి కెసిఆర్ కు ధన్యవాదాలు**

ముఖ్యమంత్రి కెసిఆర్ కు హృదయపూర్వకంగా నియోజకవర్గము తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్టు రంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేష్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో, పరిపాలన రంగాల్లో తిరుగులేని నేతగా అవతరించి నేడు మళ్లీ ముఖ్యమంత్రి ఆశీస్సులు పొంది మరోసారి ఎన్నికల బరిలోకి దిగబోతున్న తమ నాయకుడు అంజయ్యనే విజయం తప్పకుండా వరిస్తుందని తామంతా కష్టపడి ఎమ్మెల్యే అంజయ్యను గెలిపిస్తామని అన్నారు.

అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ ఎవరెన్ని అవాంతరాలు సృష్టించడానికి ప్రయత్నించిన చివరకు నిజమైన నాయకుడికే అధిష్టానం పట్టం కట్టిందని అన్నారు. ఫరూక్ నగర్ ఎంపీపీ ఇద్రీస్ మాట్లాడుతూ నిబద్ధతగల నాయకుడు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అని ఆయన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

**ఎమ్మెల్యే అంజయ్యకు అభినందనల వెల్లువ**

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మరోసారి టికెట్ ఇవ్వడంతో అభిమానుల సంతోషానికి అవధులు లేవు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి టిఆర్ఎస్ శ్రేణులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పూలమాలలు బొకేలు శాలువాలతో ఎమ్మెల్యే అంజయ్యను అభిమానంతో ముంచెత్తారు. అదేవిధంగా నాలుగవసారి కూడా ముఖ్యమంత్రి అభిమానం చూరగొన్న దరిమిలా ఎమ్మెల్యే అంజయ్యకు మీడియా తరపున సీనియర్ జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజా వరప్రసాద్, ఈట గణేష్, చైర్మన్ నరేందర్, ఎంపీపీ లక్ష్మణ్ నాయక్, తాండ్ర వెంకట్ రెడ్డి, పాతూరి వెంకట్రావు, చిలకమర్రి రవీందర్ రెడ్డి, నందారం అశోక్ యాదవ్, బీశ్వ రామకృష్ణ, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, శ్రీధర్ రెడ్డి, రామగళ్ళ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి ఒప్పుకున్నకేసీఆర్!

హైదరాబాద్: సీఎం కేసీఆర్ స్వయంగా తన ఓటమిని ఒప్పుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయడం ద్వారా ఈ విషయం స్పష్టమైందని అన్నారు. అభ్యర్థుల ప్రకటన సమయంలో ముఖ్యమంత్రి గొంతులో ఓటమి భయం స్పష్టంగా కనిపించిందని, ఆయన పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డి రెండింటిలో ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మొత్తం సిట్టింగులకు సీట్లివ్వాలన్న తన సవాల్‌ను స్వీకరించకుండా కొందరిని మార్చారని అన్నారు. సోమవారం గాందీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డికి పారిపోతున్నారని తాను మొదటి నుంచి చెప్పిన మాటలు నిజమయ్యాయని రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ జాబితా చూసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయిందని, మూడింట రెండొంతుల మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'కేసీఆర్ పారిపోవాలనుకుంటే సిద్దిపేట ఉంది.. సిరిసిల్ల ఉంది..కానీ ఒక మైనారిటీ నేత బరిలో ఉన్న కామారెడ్డికి వెళ్లడం.. మైనారిటీలను అవమానించడమే. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ఎనలేని సేవ చేశారు. కాంగ్రెస్ అంతా షబ్బీర్ అలీకి అండగా ఉండి కేసీఆర్ పని పడుతుంది. అసలు కేసీఆర్ సొంత జిల్లా సిద్దిపేటకు వెళ్లకుండా కామారెడ్డికి ఎందుకు వెళ్తున్నారో ప్రజలకు చెప్పాలి..'అని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ ఓటమి సూర్యాపేట సభలోనేబీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 12.03 గంటలకు విడుదల చేస్తున్నట్లు ప్రచారం జరగగా, ఆ సమయంలో లిక్కర్ షాపుల డ్రా తీశారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి కేసీఆర్ ప్రాధాన్యత ఏంటో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని అన్నారు.

## నిర్విరామంగా 12 గంటల నడక

విజయవాడ: : పాదయాత్రను నాయకులు సాధారణంగా రోజూ ఉదయం ప్రారంభించి రాత్రి విడిది కేంద్రంలో బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం మళ్లీ మొదలుపెడతారు. అయితే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. ఓ వైపు భుజం నొప్పి బాధపెడుతున్నా.. నిరంతర నడకతో కాళ్లు పట్టేసినా.. కేలండర్‌లో తేదీ మారినా నిర్విరామంగా 12 గంటలు పాదయాత్ర చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3.40 గంటల ప్రాంతంలో విజయవాడ ఏ కన్వెన్షన్ నుంచి ప్రారంభించిన పాదయాత్రకు సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు నిడమనూరు వద్ద విరామమిచ్చి అక్కడే బస చేశారు. తన కోసం వేచి ఉన్న మహిళలు, చిన్నారులను ఆప్యాయంగా పలుకరిస్తూ, వారితో ఫొటోలు దిగుతూ పాదయాత్ర చేశారు. యువగళం పాదయాత్రలో 189వ రోజు ఈ ఘట్టం చోటు చేసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం లోకేశ్ పాదయాత్ర విజయవాడ ఏ కన్వెన్షన్ నుంచి నిడమనూరు వరకు 16 కిలోమీటర్లు జరగాలి. యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అడుగడుగునా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి నీరాజనాలు పట్టడంతో చాలా నెమ్మదిగా ముందుకు సాగింది. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి లోకేశ్‌తో ఫొటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. యాత్ర సుదీర్ఘంగా సాగుతుండటంతో పాటు కరచాలనాలతో చేతులు నిండా గాట్లు ఏర్పడి ఇబ్బంది పెడుతున్నా లోకేశ్ చిరునవ్వుతో ముందుకుసాగారు. పోరంకి ప్రాంతానికి యాత్ర చేరుకునే సమయానికి జోరున వర్షం పడినా వర్షంలోనే యాత్ర కొనసాగించారు. తెల్లవారుజామున 4 గంటలకు పాదయాత్ర ముగించారు.

# సిట్టింగులకే సై!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్నారు. కేసీఆర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. సర్వేలు, ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక పరిస్థితుల మేరకు ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించగా.. 4 చోట్ల కొత్త ముఖాలకు చోటు కల్పించారు. మూడు చోట్ల వారసులకు అవకాశమిచ్చారు.

**అభ్యర్థుల విశేషాలు ఇవీ..**

తాజాగా ప్రకటించిన బీఆర్ఎస్ జాబితాలో నలుగురు.. అనిల్ జాదవ్ (బోథ్), భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్ (ఖానాపూర్), లాస్య నందిత (కంటోన్మెంట్), కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల) తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. చాలామంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ వారసులకు టికెట్ ఇవ్వాలని కోరినా.. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్‌కు మాత్రమే అవకాశమిచ్చారు. ఇక సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న ఇటీవల మృతి చెందడంతో.. ఆయన కుమార్తె లాస్య నందితకు టికెట్ ఇచ్చారు. దుబ్బాక నుంచి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలవడంతో.. ఆమె గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకుని సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ నిరాకరించారు. పౌరసత్వ వివాదం నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును తప్పించి.. చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు అవకాశం ఇచ్చారు.

# ఉద్యోగుల ఆకాంక్ష తీరేలా!

(మొదటి పేజీ తరువాయి)

ముందున్నామని తెలిపారు. ఉద్యోగులకు మంచి చేసే విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులదని, వారికి తోడుగా ఉంటున్న ప్రభుత్వమని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే.. సంక్షేమాన్ని అందించడం, అభివృద్ధిని పంచిపెట్టడం, సేవా ఫలాలను ప్రజల దాకా తీసుకెళ్లడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు ఉద్యోగులే. విధాన నిర్ణయాలు తీసుకునేది రాజకీయ వ్యవస్థ, ముఖ్యమంత్రి అయితే వాటిని అమలు చేసేది మీరే. పౌర సేవలు ప్రజల వద్దకు డెలివరీ అయ్యేది మీ భుజ స్కందాలపైనుంచే. మీ సంతోషం, మీ భవిష్యత్ మన ప్రభుత్వ ప్రాధాన్యతలేనని మీ అందరికీ మరోసారి భరోసా ఇస్తున్నా. అది నా బాధ్యత. ప్రభుత్వం అనే కుటుంబంలో కీలక సభ్యులైన మీ అందరి పట్ల అభిమానాన్ని, గౌరవాన్ని, ప్రేమను, మరీ ముఖ్యంగా నిజాయితీని చాటే విషయంలో మన ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వంతో పోల్చినా మిన్నగా, సానుకూలంగా ఉందని సవినయంగా తెలియజేస్తున్నా. 2019లో అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఆర్నెళ్లలోనే గ్రామ స్థాయిలో సేవలను అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో ఎంత కమిట్‌మెంట్ చూపించామంటే ఏకంగా 1.35 లక్షల శాశ్వత ఉద్యోగాలను ప్రతి గ్రామం, మున్సిపాలిటీ వ్యవస్థలో సచివాలయ వ్యవస్థ ద్వారా రిక్రూట్ చేశాం. చాలామంది ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అసాధ్యమన్నారు.దవారి బాధలకు వాళ్లను వదిలేయాలని ఎంతో మంది సలహా ఇచ్చారు. విలీనంతో ఎన్నో సమస్యలు వస్తాయన్నారు. అయినాసరే ఆర్టీసీ ఉద్యోగులపై మమకారంతో కమిట్‌మెంట్‌లో ఎక్కడా లోపం చేయలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మీరందరూ చూశారు.

# మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం!

హైదరాబాద్: ఆర్థిక మంత్రి హరీశ్‌రావుపై మల్కాజిగిరి శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు చేసిన తీవ్ర వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ఆయనను మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, పార్టీ గీత దాటారనే కారణంతో వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. తన కుమారుడికి మెదక్ అసెంబ్లీ టికెట్ నిరాకరించిన నేపథ్యంలో మంత్రి హరీశ్‌పై హన్మంతరావు తిరుమలలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మెదక్‌లో ఆయన పెత్తనం ఏమిటి..ఆయనకు బుద్ధి చెప్తా. సిద్దిపేటలో ఆయనకు అడ్రస్ లేకుండా చేస్తా. ఆయన దుకాణం బంద్ చేసేవరకు నిద్రపోను..'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనంపల్లి వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వీటిపై స్పందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

# చట్ట ప్రకారమే సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

రాత్రిళ్లు సోదాలు చేస్తుంటే తామేదో నేరం చేస్తున్నట్లు కోర్టులో ఫిర్యాదు చేస్తోందని అన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. షట్టర్లు మూసి సోదాలు చేస్తున్నామన్న దాంట్లో వాస్తవం లేదన్నారు. ఆ సంస్థ చట్ట ఉల్లంఘనలకు సంబంధించి కొన్ని ఘటనలు రిజిస్ట్రార్ల దృష్టికి వచ్చినందునే చట్ట ప్రకారం చర్యలు చేపట్టారని, నిబంధనలను అనుసరించే స్వతంత్రంగా సోదాలు చేస్తున్నారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఏ ఆదేశాలనూ ఉల్లంఘించలేదన్నారు.

**గత సోదాల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి**

సీఐడీ తరఫు న్యాయవాది వై.శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. మార్గదర్శిపై నమోదైన పలు కేసుల్లో దర్యాప్తు జరుగుతోందని, రెండింట్లో చార్జిషీట్లు దాఖలు చేశామని చెప్పారు. గతంలో నిర్వహించిన సోదాల్లో సీఐడీకి లభించిన పలు కీలక డాక్యుమెంట్లను అధ్యయనం చేసిన తరువాత మార్గదర్శి ఎలాంటి మోసాలకు పాల్పడిందో అర్థమైందన్నారు. ఓ చిట్ గ్రూపులో ఇవ్వాల్సిన మొత్తాలను మరో చోట సర్దుబాటు చేస్తున్నారని తెలిపారు. నర్సరావుపేట చిట్ గ్రూపునకు చెల్లించాల్సిన మొత్తాలను రాజమండ్రి గ్రూపులకు సర్దుబాటు చేస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. చందాదారులకు తెలియకుండానే ఇలాంటి వ్యవహారాలు మార్గదర్శిలో చాలా జరుగుతున్నాయన్నారు.

అంతకు ముందు మార్గదర్శి యాజమాన్యం తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు, మీనాక్షి ఆరోరా వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రాత్రి వేళ సోదాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతిసారీ తాము హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెస్తుంటే.. కొత్త ఎత్తుగడలతో ప్రభుత్వం సోదాలు చేస్తోందన్నారు. గతంలో ఇలాంటి సోదాలు జరగలేదని, 2019లో ప్రభుత్వం మారిన తరువాతే జరుగుతున్నాయని అన్నారు. సోదాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ఉత్తర్వులు చెల్లవన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మంగళ లేదా బుధవారం మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం వెలువరిస్తానని తెలిపారు. అప్పటివరకు సోదాలు చేయకుండా అధికారులకు తగిన సూచనలు చేయాలని ఎస్‌జీపీ చింతల సుమన్‌కు మౌఖికంగా తెలిపారు.

# మహిళలకు ఆరు సీట్లేనా?

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేసి.. 3౦3 కలిసి 6 సీట్లే మహిళలకు కేటాయించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. 'ఇవేనా మీ బంగారు కుటుంబానికి వచ్చే లెక్కలు? ఇదేనా మహిళలకు మీరు చేయాలనుకున్న న్యాయం?'అంటూ పరోక్షంగా ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. సోమ వారం బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల ప్రక టన అనంతరం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 'బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన జాబితా చూస్తుంటే.. మరోసారి అధికారంలోకి రాలేమని కేసీఆర్‌కు అర్థమైనట్లుగా తెలుస్తోంది. రోజురోజుకూ ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి కేసీఆర్‌లో ఆందోళన మొదలైంది. గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని కేసీఆర్ నిర్ణయించుకోవడం ఆయనలో నెలకొన్న భయానికి నిదర్శనం..'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'మతోన్మాద మజ్లిస్ అభ్యర్థులను గెలిపించేందుకు, ఆ పార్టీ వ్యతిరేక ఓట్లు చీలేందుకు, ఆయా ప్రాంతాల్లో ఒవైసీ చెప్పిన అభ్యర్థులను బరిలో దించుతూ..కేసీఆర్ దోస్తుకు మద్దతుగా నిలుస్తున్నారు..'అని కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ ప్రాంతంలో బీఆర్ఎస్, మజ్లిస్ కలిసి 29 సీట్లు గెలవాలని కేసీఆర్ మీడియా సమావేశంలోనే ప్రకటించారని పేర్కొన్నారు.

# ఆత్మ విశ్వాసమా.. బలహీనతా?

(మొదటి పేజీ తరువాయి)

సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి అవకాశం ఇవ్వడంపై పార్టీ శ్రేణుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది.దళితబంధులో 30శాతం ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారంటూ స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పిన నేపథ్యంలో.. ఇప్పుడు అందరికీ టికెట్ కేటాయించడం ఏమిటనే సందేహాలు వస్తున్నాయి. గెలుపు గుర్రాలు కాని వారికి కూడా ఒత్తిళ్లు, లాబీయింగ్‌కు తలొగ్గి టికెట్లు కేటాయించి కేసీఆర్ బలహీనత చాటుకున్నారనే విమర్శలూ వస్తున్నాయి. బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో సామాజిక సమతుల్యతను పాటించలేదని, మహిళలకు కనీసం పది సీట్లయినా కేటాయించకపోవడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో 54శాతానికిపైగా ఉన్న బలహీనవర్గాలకు కేవలం 20శాతం సీట్లు కేటాయించడం సరికాదని ఆయా సామాజిక వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇదే సమయంలో 15శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఏకంగా 50శాతానికిపైగా సీట్లను కేటాయించడం ఏ విధంగా సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. గతంలో బీసీలకు కేటాయించిన హుజూరాబాద్, కామారెడ్డి స్థానాలను సైతం ఈసారి అగ్రవర్ణాలకు కేటాయించడమేంటని మండిపడుతున్నాయి. వందల సంఖ్యలో ఉన్న బీసీ కులాల్లో కేవలం ఆరు కులాలకే ప్రాతినిధ్యం దక్కడం, ఇందులోనూ మున్నూరు కాపు మినహా మిగతా కులాలకు నామమాత్రంగానే టికెట్లు ఇవ్వడంపై పెదవి విరుస్తున్నాయి.

సమ సమాజం
మంగళవారం 22 -8-2023
www.samasamajam.in


# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**జిల్లా అదనపు కలెక్టర్ డీఎస్‌లతా**



**జగిత్యాల టౌన్ / సమ సమాజం:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్‌లత తెలిపారు .సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 21 దరఖాస్తులను అదనపు కలెక్టర్ రెవిన్యూ బిఎస్ లత స్వీకరించి సత్వర పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులపై ప్రభుత్వ నియమ నిబంధనలకులోబడి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని. ప్రజలు అందించిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్య నిజమైనదా కాదా అనే విషయాన్ని పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మొగ్గు చూపిన గులాబీ బాస్.

- జగిత్యాల, ధర్మపురి నుండి డా "సంజయ్ కుమార్, మంత్రి కొప్పుల.
- కోరుట్ల స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తనయుడు కే.సంజయ్ కుమార్ కు కొత్తగా అవకాశం.
- చొప్పదండి అభ్యర్థి రవిశంకర్ ఖరారు.
- వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు అభిమానుల్లో కలవరం.

**జగిత్యాల జిల్లా ,సమ సమాజం:** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీలు తగు ఏర్పాట్లు, ప్రచారం చేసుకుంటు ఎన్నికలకు సమాయత్తం అవుతుండగా అన్ని పార్టీలకంటే ముందుగా బి ఆర్ ఎస్ పార్టీ దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యే లకు అవకాశం కల్పించింది.రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులపై క్షేత్రస్థాయిలో సర్వేలు జరిపిన గులాబీ బాస్ సిట్టింగ్ అభ్యర్థిలకే మొగ్గు చూపారు ఈమేరకు సోమవారం మీడియా సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నియోజ కవర్గాల అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేశారు. జిల్లాలోని ప్రధానంగా మూడు నియోజ కవర్గాలకు గాను రెండు జగిత్యాల,ధర్మపురి స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు జగిత్యాల డాక్టర్ సంజయ్ కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే, సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మళ్ళీ అవకాశం కల్పించారు.అయితే కోరుట్ల నియోజకవర్గంలో ఊహించినట్లు గానే స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు వయసు, ఆరోగ్య పరిస్థితి ని దృష్టిలో ఉంచుకొని ఆయన అభ్యర్థన మేరకు కోరుట్ల నియోజకవర్గ స్థానంలో స్వల్ప మార్పు చేసిన గులాబీ బాస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ కు టికెట్ కేటాయించారు.కాగా జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యే ల అభిమానులు, పార్టీ కార్యకర్తలు అటు కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అభిమానులు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు సైతం తమ నాయకులు విద్యాసాగర్ రావు తనయులు కే. సంజయ్ కుమార్ కు ఎమ్మెల్యే టికెట్ రావడం పట్ల గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ వివరాలు వెల్లడించిన వెనువెంటనే హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు.




## వేములవాడ బిఆర్ఎస్ శ్రేణుల్లో కలవరం..!

జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల, మల్యాల మండలాలలోని పలు గ్రామాలను కలుపుకొని ఉన్న చొప్పదండి నియోజకవర్గం టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కు ఖరారు చేయగా మరోసారి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కు ఆ అవకాశం లభించగా కొడిమ్యాల, మల్యాల మండలాల లోని కొన్ని గ్రామాల బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.అలాగే జిల్లాలోని మేడిపల్లి, కథలాపూర్ మండలాలను కలిగి ఉన్న వేములవాడ నియోజకవర్గం లో సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ను తప్పించి ఆయన స్థానంలో చలిమెడ లక్ష్మి నర్సింహారావుకు కేసిఆర్ కొత్తగా అవకాశం కల్పించారు. అయితే ఇక్కడ రమేష్ బాబు విషయంలో ఆయన బహుళ పౌరసత్వాన్ని కలిగి ఉండడం అతని పౌరసత్వాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సవాలు చేయడం హైకోర్టు తీర్పు తో సుప్రీం కోర్టు కు అప్పీలుకు వెళ్లిన నేపథ్యంలో గులాబీ అధినేత కేసిఆర్ రిస్కు తీసుకోకుండా ఆయన స్థానంలో కొత్తగా చలిమెడ లక్ష్మి నర్సింహా రావు కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్ బాబు అభిమానులతో పాటు వేములవాడ నియోజకవర్గం లో భాగమైన జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, బీమారం, కథలాపూర్ లో చేసిన అనేక పెండింగ్ లో ఉన్న అభివృద్ధికి సంబందించిన పనులు చేయడం ప్రధానంగా రమేష్ బాబు జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి,బీమారం, కథలాపూర్ మండలాల అభివృద్ధిపై దృష్టిపెట్టడం వల్ల ఇక్కడ కూడా ఎమ్మెల్యే సి హెచ్ రమేష్ బాబు వ్యక్తిగతంగా పట్టు సాధించగా ఇక్కడ బి ఆర్ ఎస్ శ్రేణులు ముఖ్యంగా ఎమ్మెల్యే రమేష్ బాబు అభిమానులు ఎమ్మెల్యే రమేష్ బాబుకు టికెట్ రాకపోవడం వల్ల కార్యకర్తలు అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. రమేష్ బాబు పై ఆధారపడి ప్రచారం చేసిన బి ఆర్ ఎస్ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కలవరప డుతున్నారు. అయినా ఎమ్మెల్యే రమేష్ బాబు పట్ల సీఎం కెసిఆర్ కు, ముఖ్యమంత్రి తనయులు మంత్రి కేటీఆర్ కు ఆయన వయసు తో పాటు రాజకీయ నేపథ్యం గల కుటుంబ చరిత్ర గల ఎమ్మెల్యే రమేష్ బాబు పట్ల గౌరవం ఉంది రానున్న రోజుల్లో మరేదైనా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# బోనమెత్తి ఏఎన్ఎంల నిరసన కొత్త నోటిఫికేషన్ రద్దుచేసి రెగ్యులరైజ్ చేయాలని ఏఎన్ఎం ల డిమాండ్.

**జగిత్యాల,సమ సమాజం:** రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఏఎన్ఎంల రిక్రూట్మెంట్ కోసం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ ను రద్దు చేసి 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు తమ సర్వీస్ రూల్స్ ను క్రమబద్ధికరించాలని డిమాండ్ చేస్తూ 6 రోజులుగా జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం బోనాలు ఎత్తి ఏఎన్ఎంలు రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు. బోనాలు ఎత్తుకుని సమ్మె శిబిరం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఏఎన్ఎంలు ప్రభుత్వ తీరును నిరసిస్తూ కొద్దిసేపు నిరసన తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన మాదిరిగా ఏఎన్ఎంలను కూడా గుర్తించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధురిమ కోరారు. డిమాండ్లు నెరవేర్చాలని గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మధురిమ ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన కేసీఆర్ మాట నిలబెట్టుకోవడం లేదని మండిపడ్డారు.నోటిఫికేషన్ రద్దు చేసి, ఏలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని మధురిమ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడితే హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. నిరసనలో ఎలిజబెత్ రాణి, రమాదేవి, మేరీ, పి.శిరీష, ఏ.పద్మ, కోమల, శిరీష, జమున, శారద, చిలుకమ్మ, నీరజ, స్వరూప, గణిత,ఊర్మిళ, సరోజ, రజిత, సరోజ, సౌజన్య,సుశీల,సునీత,సంధ్య, జయప్రద, పుష్ప, సమతా, రజితబాయి, సుమలత, భాగ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనం ప్రారంభించి మొక్కలు నాటిన ఎమ్మెల్యే డా.సంజయ్.



**జగిత్యాల, సమ సమాజం:** రాయికల్ మండల ఇటిక్యాల గ్రామంలో 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి,5 లక్షలతో గ్రామంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనం ప్రారంభించి,హరిత హారం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మొక్కలు నాటారు. అనంతరం గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిది ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.గ్రామంలో ముదిరాజ్,ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేసి, గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి,జడ్పిటిసి అశ్విని జాదవ్, సర్పంచ్ లావణ్య, మున్సిపల్ చైర్మన్ మోర హను మండ్లు, ఏఎంసీ చైర్మన్ రాణి, మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్,ఉప అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఎంపిటీసీల ఫోరం నాగరాజు, ఉపసర్పంచ్ చంద్రశేఖర్ గ్రామ శాఖ అధ్యక్షులు కోడిపల్లి స్వామి రెడ్డి, మాజీ సర్పంచ్ లు నారాయణ గౌడ్,శ్రీనివాస్, జిల్లా రైతు బంధు సమితి నాయకులు సాయ గౌడ్ ,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కొల్లూరు వేణు,గ్రామ శాక ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్,యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ,తదితరులు పాల్గొన్నారు.

# తల్లి జ్ఞాపకార్థం వైకుంఠ రథం తయారు చేయించిన తనయుడు

**మేడిపల్లి సమ సమాజం:** జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండలం కాచారం గ్రామానికి చెందిన చిట్యాల సురేష్ గ్రామ సర్పంచ్ తన స్వంత వ్యయంతో తన తల్లి చిట్యాల గంగపోస మరియు తాత చిట్యాల నచ్చయ్య గార్ల జ్ఞాపకార్థం సుమారు 3 లక్షల రూపాయలతో వైకుంఠ రథంను తయారు చేయించారు. ఈరోజు నుండి ఈ వైకుంఠ రథంను కాచారం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటుందని సర్పంచ్ సురేష్ తెలియజేశారు ఇట్టి వైకుంఠ రథాన్ని గ్రామపెద్దమనుషులు, యువకుల సమక్షంలో కాచారం గ్రామ పంచాయతీకీ అప్పగించారు. ఈ కార్యక్రమ నిర్వహణ సందర్భంగా చిట్యాల సురేష్ , ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న సహసోపేతమైన నిర్ణయానికి కాచారం గ్రామ ప్రజలు అందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల సురేష్ ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న సామజిక సేవా కార్యక్రమాలను కోనియాడుతూ.. భవిష్యత్తులో వారు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించాలని కోరారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పెద్దమనుషులు, యువత,తదితరులు ఘనంగా అభినందనలు తెలుపుతూ ఘనంగా అభినందిస్తున్నారు

# నేడు గుండేటి రాజు కు కళా సేవా పురస్కారం ప్రదానం.



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో తేదీ. 22 ఆగస్టు మంగళవారం కరీంనగర్ లో ప్రపంచ జానపద కళోత్సవాల సందర్భంగా స్థానిక ఫిలిం భవన్ లో నిర్వహించే కార్యక్రమంలో జగిత్యాల కు చెందిన కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు మూడు దశాబ్దాలుగా చేస్తున్న కలసేవకు కళా సేవా పురస్కారం. 2023 గాను ప్రదానం చేస్తున్నట్లు కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు జి. కృపాదానం తెలిపారు. ఈ అవార్డ్ పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు టి.వి.సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్నాం కిషన్ రెడ్డి, టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్. జయపాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అలిశెట్టి రాజు, బోనగిరి దేవయ్య,బి. ఆనందరావు, ఒడ్నాల రాజశేఖర్, కవయిత్రులు మద్దెల సరోజన, కటుకం కవిత, అయిత అనిత లు హర్షం వ్యక్తం చేశారు

# ఘనంగా నాగుల పంచమి వేడుకలు



**జగిత్యాల టౌన్ / సమ సమాజం:** పట్టణంలోని వివిధ వార్డుల్లో నాగుల పంచమి వేడుకలను మంగళవారం మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.ఈ వేడుకలను పురస్కరించుకొని సమీప ఆలయాల్లోని నాగదేవత ప్రతిమలకు పాలు పోసి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మరికొందరు మహిళలు శివారు కాలనీలోని నాగు పుట్టలో పాలు పోసి వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా నాగ దేవతలకు పాలు పోసి ఇష్ట నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. జగిత్యాల భక్త మార్కండేయ దేవాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బోగ శ్రావణి ప్రత్యేక పూజలు చేశారు.

# ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సంజయ్.



**జగిత్యాల,సమ సమాజం:** ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ టికెట్ కేటాయించిన సందర్భంగా ముఖ్యమంత్రి తనయి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం హైదరాబాద్ లోని తన నివాసంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీ ని మర్యాదపూర్వకంగా కలిసిన కోరుట్ల అభ్యర్థి డా.సంజయ్.



**జగిత్యాల, సమ సమాజం:** కోరుట్ల నియోజకవర్గం నుండి నూతనంగా బిఆర్ఎస్ టికెట్ పొందిన కోరుట్ల నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ తనకు టికెట్ కేటాయించిన సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు.కాగా డా. సంజయ్ కుమార్ కు గులాబీ బాస్ కోరుట్ల టికెట్ ఇచ్చిన సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం లోని బి ఆర్ ఎస్ నాయకులు జిల్లా రైతు బందు అధ్యక్షులు చీటి వెంకట్ రావు, సంగెం గ్రామ రైతు బందు అధ్యక్షులు సుదవేణి భూమయ్య, సర్పంచ్ చెప్యాల నర్సయ్య, వార్డు మెంబెర్ దోనే రాజు, నాయకులు జక్కని గణేష్, వల్లకొండ దామోదర్, కొమ్ముల మోహన్ రెడ్డి లతో పాటు బి ఆర్ ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి సంగెం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు.

# జగిత్యాల బిఆర్ఎస్ శ్రేణుల సంబురాలు.

**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రస్తుత ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కు గులాబీ బాస్ మరొకసారి అవకాశం కల్పించిన సందర్భంగా పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ కు ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రం లో కొత్త బస్టాండ్ తో పాటు పట్టణంలోని ప్రధాన కూడల్ల వద్ద బి ఆర్ ఎస్ శ్రేణులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in